

# న్యూవేవ్

పోతేపూడి రాజారావు

అదొక ప్రైవేట్ కాలేజీ ఫిజిక్స్ లెక్చరర్ పోస్ట్‌కోసం ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. అది మేనేజ్‌మెంట్ రూమ్. నలువైపులా గ్లాసులతో బిగించిన 'గ్లాస్‌రూమ్'. అది సౌండ్‌ప్రూఫ్‌రూమ్. లోపల జరిగే మాటలు బయటకు వినిపించవు, లోపల తిరిగే మనుషులు మాత్రం బయటకు కన్పిస్తారు. ఆ రూమ్‌లో మానేజ్‌మెంట్ వారయిన ప్రెసిడెంట్, సెక్రటరీలు, ప్రిన్సిపల్, యూనివర్సిటీ రిప్రజెంటేటివ్, గవర్నమెంట్ రిప్రజెంటేటివ్ అయిన డీ—యీ-ఓ. ఇంకా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఇత్యాదులు త్రికోణంలో కూర్చుని వున్నారు. మరో కోణంలో వాళ్ళకెదురుగా క్యాండేట్ కూర్చుని వాళ్ళడిగిన ప్రశ్నలకు ఏవో సమాధానాలు చెప్తున్నట్లుగా అద్దాల్లోంచి బయటకు కన్పిస్తున్నారు.

ఇంటర్వ్యూకొచ్చిన అభ్యర్థులు బయట వరండాలో బెంచీల మీద, ఒకో బెంచీకి ఏడెనిమిది చొప్పున కిక్కిరిసి కూర్చొన్నారు. కొందరు స్థలంచాలక బయట ఎండలో నుంచున్నారు. వాళ్ళు నీడ కోసం వార్తా పత్రికలు, చేతిలో వున్న సర్టిఫికెట్ కవర్లు అడ్డం పెట్టుకొన్నారు. పట్టిన చెమట తుడుచుకొంటున్నారు. ఎండలో నిలబడలేక విసుగు చెంది వరండాలో బెంచీ మీద కూర్చున్న తోటి క్యాండేట్స్ మీద దాడి చేస్తున్నారు.

ఎండలో నిల్చొని విసుగు చెందిన ఓ అభ్యర్థి, వరండాలోకొచ్చి బెంచీ మీద కూర్చున్న ఒకళ్ళిద్దర్ని చెయ్యి పట్టుకొని బలవంతగా లాగాడు కోపం కొద్దీ—కాసేపు

మీరు ఎండాలో నిల్చోండి! కాసేపు మేము నీడన కూర్చొంటాము!" అని గట్టిగా అడిగాడు. వాళ్ళు బెంచీని పట్టుకొని వెళ్లాడారు గానీ అతని మాటను ఒప్పుకోలేదు అంతా గందరగోళమయింది. ఆ ఎండలోన ల్చొన్న వాళ్ళు "దాహం! దాహం!" అని అర్చారు. వరండా అంతా చూశారు ఎక్కడయినా మంచినీళ్ళ బాన దొరుకుతుందేమోనని! అందులో ఆనంద్ కూడా వున్నాడు. ఆనందకూ ఆవేశం వచ్చింది. ఒకాయన కోపం ఆపుకోలేక ఆనంద్ వంక చూస్తూ ఆనంద్ అండ చూసుకొని నోరు ఎత్తాడు.

"కూర్చోటానికి బెంచీలయినా లేకుండా, తాగటానికి నీళ్ళులేకుండా ఏం చెబుతున్నార్రా నాయాళ్ళు! ఈ గ్లాస్ రూమ్ మీద ఓ బాంబు పడితే బాగుండును! నాకసి తీరుతుంది!" గుప్పిళ్ళు బిగిస్తూ అన్నాడు క్రాంతికుమార్.

"రండి! వెళ్ళి అడుగుదాంరండి! ఉద్యోగాలు ఇచ్చినా, ఇవ్వకపోయినా— కూర్చోటానికి కనీసం బెంచీలు వేయించమని, మంచి నీళ్ళు పెట్టించమని అడుగుదాంరండి! అంటూ ముందుకు నడిచాడు ఆనంద్.

"ఈ ప్రబుద్ధులు పదేసి రూపాయలు చొప్పున ఇంటర్వ్యూ ఫీజులు వసూలు చేసి కూర్చోటానికి బెంచీలు కూడా నిండుగా వెయ్యలేదు. వాళ్ళెక్కడ ఎయిర్ కండిషన్ రూముల్లో, అద్దాలగదుల్లో, మత్తు మందులు వేసుకొని మరో ప్రపంచంలో విహరిస్తూ వుండాలి! మనం ఇక్కడ ఎండలో చావాలి!" అన్నాడు మరో అభ్యర్థి.

ఆ ఎండలో వాళ్ళంతా వరండాలోకి వచ్చారు. వరండాలో ఇంకా బెంచీ మీద సీటు కోసం సంఘర్షణ జరుగుతూనే వుంది.

"మీరెప్పట్నుంచో కూర్చొన్నారు! మమ్మల్ని కూడా కాసేపు కూర్చోనివ్వండి! మీరు కూడా కాసేపు ఆ ఎండలో నిలబడి రండి' అప్పుడుగానీ మా బాధ మీకు తెలియదు! అప్పుడుగానీ మనమంతా ఒక్కటికాము! అప్పుడుగానీ మన ఈ తగాదా సమసిపోదు!" అంటూ ఒకాయన అర్థ్యా చేశాడు.

"మాకు నిలబడే ఓపిక లేదు బ్రదర్! మా ఓపికంతా లోగడ ఇంటర్వ్యూలకే ఖర్చయి పోయింది. మేము లేవలేం! పైగా మేము ముందొచ్చాం!" అన్నాడు లేవనంటూ ఒకాయన.

ఆనంద్ ఆ పోట్లాట చూశాడు, "మనలో మనం కాదయ్యా పోట్లాడుకో వలసింది! మాకు కూర్చోటానికి చాలినన్ని బెంచీలు వేయించమనీ, త్రాగటానికి మంచినీళ్ళు పెట్టించమనీ మనమంతాకల్సి వాళ్ళనడుగుదాం లేవండి!" ఇద్దర్నీ ఉద్దేశించి అన్నాడు ఆనంద్.

ఆనంద్ మాటలు విని అందులో కొందరికి కోపం వచ్చింది. "ఉద్యోగాలకోసం వచ్చి వాళ్ళతో పోట్లాడటమా?" అని, "వచ్చే ఉద్యోగాన్ని ఎక్కడ పోగొట్టుకొంటాం?" అని అలా అనుకున్న వాళ్ళు కొందరు మెల్లగా వెనక్కుజారుకున్నారు.

ఆ మిగిలిన వాళ్ళతోనే ఆనంద్ ఆఫీస్ గ్లాస్ డోర్ వైపుకు నడిచాడు. అందులోనూ కొందరు మళ్ళీజారి పోయారు. ఇంక మిగిలింది. క్రాంతికుమారూ, మరో ఒకళ్ళిద్దరు.

ఆనంద్ గ్లాస్ డోర్ తీసి స్ప్రింగ్ షెట్టర్ దగ్గర నిలబడి "సార్! మిమ్మల్నొక మాట అడగాలి! లోపలకురమ్మంటారా?" అన్నాడు

గేట్ ప్యూన్‌ని ఎదుర్కొంటూ, ప్రెసిడెంట్, సెక్రటరీల వైపుకు చూస్తూ.

వీళ్ళంతా వరండాలో ఇక్కడ ఘర్షణ పడుతున్న సమయంలో గ్లాస్ రూంలో సీను మారింది. ఇంటర్వ్యూ అయిన అభ్యర్థిని దొడ్డి దారిన పంపివేశారు. అతణ్ణడిగిన ప్రశ్నలు వరండాలో వున్న అభ్యర్థులకు తెలియకుండా వుండుగానని, ఇంటర్వ్యూ అయిన వాళ్ళను మరో దారిన పంపించివేశారు. క్యాండేట్, క్యాండేట్‌కి మధ్య పదిహేను నిముషాలు టైము తీసుకొని ఇంటర్వ్యూ చేస్తూ వాళ్ళు ఫ్రూట్స్, డ్రింక్స్ తీసుకొంటున్నారు. సిగరెట్ పొగలు వదులుతున్నారు. ఆనంద్ అడుగుతున్నపుడు అతనికి కనబడిన దృశ్యం అది.

ఆనంద్ అలా దౌర్జన్యంగా ప్రవేశించటం చూసి వాళ్ళక్కోపం వచ్చింది.

“ఏమిటయ్యా! నువ్వడిగేది? అడగాల్సింది మేము! ముందు బయటకు వెళ్ళు!” గద్దించాడు ప్రెసిడెంట్.

“మేము పిలుస్తాం కదా! నీకంత తొందరెందుకు?” అన్నాడు సెక్రటరీ.

“సార్! అయాం నాట్ టాకింగ్ ఎబౌట్ ఇంటర్వ్యూ! ముందు మాకు కూర్చొటానికి. వుయ్ డోంట్ కేర్ ఇంటర్వ్యూ బెంచీలు వేయించండి! త్రాగటానికి మంచి నీళ్ళు పెట్టించండి! మమ్మల్ని ఎండలో నిలబెట్టడం మీకు సరదాగా వుందా? మేమూ మనుషులమే! మీలాంటి సుఖాలు చూడాలని మాకూ వుంది!” అన్నాడు ఆనంద్.

ఆ మాటలు విని ప్రెసిడెంట్ కళ్ళెర్రజేసి కాలుతో కాలింగ్ బెల్ నొక్కాడు. పరిగెత్తుకుంటూ మరిద్దరు ప్యూన్‌లు ప్రవేశించారు.

“పదవయ్యా! పద!” అంటూ ఆనంద్‌ని బలంగా నెట్టారు. ఆనంద్ పడిపోయాడు. స్పృహతప్పాడు రక్తంకారింది. నురుగులు కూడా కక్కాడు.

ప్రక్కన వున్న క్రాంతికుమార్, మరి ఇతర అభ్యర్థులు అతని దగ్గరకువెళ్ళి చేతిరుమాలు రక్తం కారకుండా అడ్డుపెట్టారు. ఒకరు నోటి వెంట కారుతున్న నురుగుతుడిచారు. స్పృహరావటానికి ప్రయత్నించారు.

ఇంతలో ప్రెసిడెంట్, సెక్రటరీలు షెట్టర్ దగ్గరకొచ్చి నిలబడ్డారు. వాళ్ళవంక మిర్రి మిర్రి చూశారు. వాళ్ళ మొజాయిక్ ఫ్లోర్ రక్తసిక్తమయింది.

“ఏమిటీ న్యూసెన్స్! ముందతన్ని అక్కడ్నుంచి తీసుకుపొండి!” అంటూ అసహ్యించుకొన్నారు.

“మీకు నిలబడడానికే నామర్దా అయినపుడు, రేపు ఉద్యోగం ఇచ్చాక మా మాట వినటానికి, మాదగ్గర పని చెయ్యటానికి కూడా నామర్దా అంటారు. మీరెక్కడో నక్సలైట్లలా కన్పిస్తున్నారు.! తిరుగుబాటుదారుల్లా కనపిస్తున్నారు!” అన్నారు కోరస్‌లో, ప్రెసిడెంట్, సెక్రటరీలు.

ఆ మాటలకు క్రాంతికుమార్‌కి కోపం వొచ్చింది. “నిజం పలకటమే తిరుగుబాటయితే నిజంగా మేము తిరుగుబాటు దార్లమే! మీరిచ్చే వెధవ ఉద్యోగం లేకపోతే చస్తామా? కాయకష్టంచేసుకొని కార్మికులుగానయినా బతుకుతాం!”

“ఇంతమందిని, ఇన్ని గంటలున్నాండి ఎండలో నిలబెట్టి, మీరేమో ఎయిర్ కండీషన్ రూమ్‌లో కులుకుతున్నారు! పొట్టకోసినా అక్షరం ముక్కలేని మీరు మా విద్యావంతుల్ని

ఇలా అవమానిస్తారా? ఇక మీ నిరక్షరాస్యుల పాలన, మీ నియంతృత్వపు పాలన ఎంతో కాలం సాగదు!" ఆక్రోశించాడు క్రాంతికుమార్.

ఆ మాటలు పట్టించుకోకుండా, వినీ విననట్లుగా గ్లాస్ డోర్ వేసుకొని లోపలకు వెళ్ళిపోయారు ప్రెసిడెంట్, సెక్రటరీలు.

ఇంతలో ఆనంద్‌కి స్పృహ వచ్చింది. క్రాంతికుమార్ తదితరులు చేతులుతో లేపి నిలబెట్టారు. ఆనంద్ ఆ గ్లాస్ రూమ్ వైపుకు చూస్తూ ఆక్రోశించాడు. "పాపాలన్నీ ఇక్కడ చేరి పొర్లి పోతున్నాయ్! పాపి కుండలు తప్పక బ్రద్దలవుతాయ్! పుణ్యోదయం దగ్గర్లోనే వుంది. రేపు మనదే!" అంటూ తన మిత్రుల భుజాల మీద చేతులు వేశాడు ఆనంద్.

"ముందు హాస్పిటల్‌కి పోదాం పద! కట్లు కట్టించుకుందువుగానీ!" అంటూ క్రాంతికుమార్ ఆనంద్‌ని తీసుకొని బయలుదేరాడు.


అభిరుచిగల పాఠకులకు

అత్యుత్తమ వారపత్రిక

ప్రజాతంత్ర